

శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ బదిలీ

నంద్యాల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లును బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద ఈయనను బదిలీ చేశారు. ఉత్తర్వులు ప్రకారం వెంటనే ఈయన ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేసుకోవాలని అదేశించారు. ఈయన స్థానంలో ఇప్పటివరకు ఎవరినీ నియమించలేదు. ఈయనతో పాటు వివిధ జిల్లాలో పనిచేస్తున్న మరో ముగ్గురు స్పెషల్ కలెక్టర్లను బదిలీ చేశారు.

యువత ప్రతిభ చాటాలి

● కలెక్టర్ రాజకుమారి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజకుమారి తదితరులు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : యువజన ఉత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటాలని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా యువజన సంక్షేమ శాఖ- సెట్కూరు ఆధ్వర్యంలో నిర్వహించనున్న నంద్యాల జిల్లాస్థాయి యువజనోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఈ ఉత్సవాలు అద్భుత వేదికగా నిలుస్తాయన్నారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీయువకులు పాల్గొనవచ్చని తెలిపారు. సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈనెల 29న పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు ఏడు విభాగాల్లో నిర్వహించబడుతాయన్నారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారు జాతీయ స్థాయికి ఎంపికవుతారని తెలిపారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు పాల్గొన్న కళాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. ఆసక్తి ఉన్న యువత వివరాలకు 9292207601, 8328181581 మొబైల్ నంబర్లను సంప్రదించొచ్చని సీఈవో తెలిపారు. డీఈవో జనార్దన్‌రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్‌నాయక్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, సెట్కూరు పర్యవేక్షణాధికారి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు ఒక వెలుగు వెలిగి..



నాడు ఓ వెలుగు వెలిగి ఎందరికో జీవనోపాధి కల్పించిన నాపరాయి నేడు కనుమరుగయ్యే దుస్థితికి చేరుతోంది. పలు నాపరాళ్ల పరిశ్రమలు మూత పడుతున్నాయి.. ఫలితంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉంది. మనిషి డిజిటల్ లైఫ్‌నకు అలవాటు పడటం.. మార్కెట్లోకి గ్రానైట్, టైల్స్ రంగప్రవేశం చేయడం.. ప్రభుత్వాలు పెంచుతున్న రాయల్టీలు, కరెంటు బిల్లులు ఇందుకు కారణం. ప్రభుత్వాలు రాయితీలు కల్పించి ఆదుకోవాలని వ్యాపారులు, కార్మికులు కోరుతున్నారు.



ఫ్యాక్టరీలో నిలిచిపోయిన యంత్రాలు



- నష్టాల ఊబిలో నాపరాళ్ల పరిశ్రమ
- రాయల్టీలు, కరెంటు బిల్లులు అధికం
- మార్కెట్లోకి గ్రానైట్స్, టైల్స్...
- వ్యాపారాలు లేక విలవిల
- ఉపాధి కోల్పోతున్న యువత

బేతంచెర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పరిసర ప్రాంతాల్లో అపారమైన ఖనిజ సంపద నిక్షిప్తమై ఉంది. గతంలో దక్షిణాది రాష్ట్రాల్లో బేతంచెర్ల కలర్ నాపరాళ్లు దర్శనమిచ్చేవి. 15 ఏళ్లుగా నాపరాళ్ల పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోయాయి. గతంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి నాపరాళ్లకు అధిక గిరాకీ ఉండటంతో వ్యాపారాలు జోరుగా సాగుతుండటంతో ఫ్యాక్టరీల యజమానులు, కార్మికులకు జీవనోపాధి లభించేంది. బేతంచెర్ల పట్టణంలో కలర్, నల్లబండ్ల నాపరాళ్ల ఫ్యాక్టరీలు సుమారు 516 ఉండేవి. ఈ ఫ్యాక్టరీల మీద ప్రత్యక్షంగా పరోక్షంగా ఐదు వేల మంది కార్మికులు జీవనోపాధి పొందేవారు. ఇటీవల గ్రానైట్స్, టైల్స్ మార్కెట్‌లోకి రావడంతో కలర్ నాపరాళ్లు, నల్లబండలకు గిరాకీ తగ్గిపోవడంతో ఫ్యాక్టరీల యజమానులు వ్యాపారాలు లేక నష్టాల ఊబిలో కూరుకుపోయారు. దీంతో ఫ్యాక్టరీలను నడపలేని పరిస్థితి ఉండటంతో మూత వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లబండలకు ఎక్స్‌పోర్ట్ ద్వారా గిరాకీ ఉండటంతో కలర్ నాపరాళ్ల ఫ్యాక్టరీలను కూడా నల్లబండ్ల ఫ్యాక్టరీలుగా మార్చుకుని వ్యాపారాలు కొనసాగించారు. అయితే ఎక్స్‌పోర్ట్ కూడా తగ్గిపోవడంతో వ్యాపారాలు లేక కలర్, నల్లబండల ఉత్పత్తి అధికంగా నిలిచిపోయిందని ఫ్యాక్టరీల యజమానులు తెలిపారు. గతంలో 465 కలర్ నాపరాళ్ల ఫ్యాక్టరీలు, 30 నల్లబండల నాపరాళ్ల ఫ్యాక్టరీలు ఉండేవి. గ్రానైట్, టైల్స్ వల్ల ప్రస్తుతం 450 నల్లబండల ఫ్యాక్టరీలుగా నాపరాళ్ల ఫ్యాక్టరీలను యజమానులు మార్చుకుని ఎక్స్‌పోర్టు చేసేవారు. దీంతో సుమారు 35 కలర్ నాపరాళ్ల ఫ్యాక్టరీలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వాలు నాపరాళ్ల ఫ్యాక్టరీలపై కరెంటు బిల్లులు అధికంగా వేస్తుండటంతో చెల్లించలేక నాపరాళ్ల ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. దీంతో నాపరాళ్ల ఫ్యాక్టరీల మీద ఆధారపడ్డ కార్మికులు జీవనోపాధి కోల్పోయి వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంటు బిల్లు, గనులను రెన్యువల్ చేసుకోవడానికి రాయల్టీలు పెంచడంతో సుమారు రూ.20 లక్షల పైగానే ప్రభుత్వాలకు చెల్లించాల్సి వస్తుందని పలువురు ఫ్యాక్టరీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి బిల్లులు చెల్లించలేక సుమారు 60 ఫ్యాక్టరీలకు పైగా మూతపడ్డాయని ఫ్యాక్టరీల యజమానులు తెలిపారు. నిరుద్యోగ యువత ఉపాధి పొందేందుకు నాపరాళ్ల ఫ్యాక్టరీలను లీజుకు తీసుకుని జీవనోపాధి పొందేవారు. ప్రస్తుతం వ్యాపారాలు లేక అధిక మొత్తంలో లీజులు, కరెంటు బిల్లులు చెల్లించలేక మూతవేసుకునే పరిస్థితి నెలకొందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా చిన్న తరహా పరిశ్రమలకు రాయితీలు కల్పిస్తూ ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఫ్యాక్టరీల యజమానులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

లీజు ఫ్యాక్టరీలను కూడా నడుపుకోలేకపోతున్నాం



ప్రభుత్వాలు పెంచుతున్న రాయల్టీలు, కరెంటు బిల్లులు, లీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాం. ఫ్యాక్టరీని లీజుకు తీసుకుని నడుపుకోలేక అప్పుల ఊబిలో కూరుకుపోయాం.

● చంద్రశేఖర్, లీజు ఫ్యాక్టరీ యజమాని, బేతంచెర్ల

వలస వెళ్లాల్సిన పరిస్థితి ..



గతంలో నాపరాళ్ల పరిశ్రమలో సెంటర్ కటింగ్ మిషన్ కార్మికుడిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడిని. ప్రస్తుతం నాపరాళ్ల పరిశ్రమలు సక్రమంగా నడవకపోవడంతో కుటుంబ పోషణ భారమై వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

● నారాయణ, సెంటర్ కటింగ్ మిషన్ కార్మికుడు, బుగ్గానపల్లె

కూటమి నేతల్లో జోష్

- ఎన్టీఆర్ చైతన్య రథయాత్ర తర్వాత ఆ స్థాయిలో మోదీ సభ
- జీఎస్టీ 2.0 సభ సూపర్ సక్సెస్
- సమష్టి కృషి సఫలం.. వెల్లువలా తరలివచ్చిన జనం



కర్నూలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞతో సినీ రంగంలో, కోట్లాది హృదయాల్లో పదిలమైన స్థానం సొంతం చేసుకున్న యుగపురుషుడు ఎన్టీఆర్ 1982లో తెలుగుదేశం పార్టీ స్థాపించిన తరువాత చైతన్య రథ యాత్రలో భాగంగా కర్నూలుకు వచ్చారు. ఆసమయంలో రహదారులు జనవరద కట్టాయి. 1992-93 మధ్యలో సింహగర్జన సభకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చారు. ఆ తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆ స్థాయిలో జరిగిన సభ బహిరంగ సభ ప్రధాని మోదీ హాజరైన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభనే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రతిష్ఠాత్మకంగా సభా ఏర్పాట్లు, జన సమీకరణ చేపట్టినా.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన జిల్లాకు వస్తున్నారు.. ఆయనను చూడాలి.. స్ఫూర్తి మాటలు వినాలన్నా సంకల్పంతో నేను సైతం అంటూ.. వెల్లువలా ప్రజలు తరలివచ్చారు. రాగమయూరి గ్రీన్‌హిల్స్ జనతోటగా మారింది. ఆనాడు రాజకీయాలకు అతీతంగా ఎన్టీఆర్‌ను చూడాలని స్వచ్ఛందంగా ప్రజలు ఎలా తరలివచ్చారో.. గురువారం జరిగిన ప్రధాని మోదీ సభకు కూడా అదేవిధంగా తరలిరావడం కొసమెరుపు. మొత్తం మీద ప్రధాని సభకు 3.50 లక్షల నుంచి 4లక్షల దాకా ప్రజలు వచ్చి ఉంటారని అంచనా. జన వెల్లువను చూసి ఆనాటి నందమూరి తారకరామారావు చైతన్య రథయాత్ర, సింహగర్జన సభలను గుర్తు చేసుకుంటున్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సక్సెస్ సభ సూపర్ హిట్ కావడంతో కూటమి నేతల్లో జోష్ నింపింది.

● **నాడు ఎన్టీఆర్:** 1983లో తెలుగుదేశం పార్టీ స్థాపించి చైతన్య రథయాత్ర పేరిట ఎన్టీఆర్ జనం ముంగిటకు వచ్చారు. ఆనాడు ఎన్టీఆర్ సైతం శ్రీశైలం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు శ్రీకారం చుట్టారు. శ్రీశైల జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాలు దర్శించుకొని మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి చైతన్య రథం ఎక్కారు. ఆత్మకూరు, నందికొట్కూరు మీదుగా కర్నూలు నగరం చేరుకున్నారు. ఎన్టీఆర్ రాక కోసం ప్రజలు రోడ్లపైనే రోజుల తరబడి నిరీక్షించారు. అధికారం చేపట్టాక 1983లో పాణ్యంలో నిర్వహించిన రూ.2 కిలో బియ్యం ప్రారంభ సభకు ప్రజా జాతర అయింది. 1992-93 మధ్య కర్నూలులో జరిగిన సింహగర్జన సభకు మేము సైతం అంటూ జనఉప్పెన ఉరకలేసింది.

● **నేడు మోదీ:** ప్రధాని మోదీ సైతం ఉమ్మడి జిల్లా కర్నూలు జిల్లా పర్యటనను శ్రీశైలం నుంచి మొదలు పెట్టారు. ఢిల్లీ నుంచి కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం చేరుకున్న ఆయన ముందుగా శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైల జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కర్నూలుకు చేరుకున్నారు.

మిగతా 9వ పేజీలో



పాణ్యంలో రూ.2 కిలో బియ్యం ప్రారంభ సభలో నాటి సీఎం ఎన్టీఆర్, సభకు హాజరైన అశేషజనవాహిని(ఫైల్)

జీజీహెచ్‌లో సీసీయూకు శంకుస్థాపన

● రూ.23కోట్లతో అత్యాధునిక వసతులతో భవన నిర్మాణం

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ యూనిట్‌కు శుక్రవారం రాష్ట్ర మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా టెంకాయకొట్టి భూమిపూజ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. రోగులు మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. రూ.23కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, నంద్యాల మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ సురేఖ, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ జిలాని, డాక్టర్ సోహైల్, ఆర్ఎంఓ వెంకటేష్, కౌన్సిలర్లు శ్యాంసుందర్, శ్రీదేవి, జైనాబీ, మాజీ కౌన్సిలర్ శివశంకర్, పబ్బతివేణు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో భూమిపూజ చేస్తున్న మంత్రి ఫరూక్

పత్తి కొనుగోలుకు సిద్ధం



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

పత్తి ధర తగ్గడంతో మార్కెటింగ్ శాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలో దించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీపావళి నాటికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని రంగంలోకి దించి పత్తిని కొనుగోలు చేయాలని చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర గతేడాది కంటే రూ. 589 పెంచింది. ఈ ఏడాది కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 8,110గా నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో ఈనెల 21 నుంచి సీసీఐ కేంద్రాలు తెరవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే విక్రయానికి మార్గదర్శకాలు ప్రకటించారు.

● ఆదోని అగ్రికల్చర్, ఆంధ్రజ్యోతి

జిన్నర్లతో కుదిరిన సయోధ్య

సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ దూదిగా మార్చి బేళ్లుగా తయారు చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. సీసీఐ నిబంధనలు భారీగా పెట్టడంతో నెల రోజులుగా పరిశ్రమ యాజమానులు ఎవరూ కూడా టెండర్ దాఖలు చేయడానికి ముందుకు రాలేదు.

- దీపావళి నాటికి సీసీఐ కేంద్రాలు
- సీసీఐకి, జిన్నర్ల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం
- పత్తి ధర పతనం కావడంతో అప్రమత్తమైన మార్కెటింగ్ శాఖ
- మద్దతు ధర క్వింటా రూ. 8,110తో కొనుగోలుకు చర్యలు
- కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు తప్పనిసరి

జిల్లాలో ఈ ఏడాది 2.27 లక్షల హెక్టార్లలో పత్తిసాగు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ముందస్తు వర్షాలు కురవడంతో పత్తి పంటను ఉత్సాహంగా సాగు చేశారు. ఆగస్టు, సెప్టెంబరులో ఎడతెరిపిలేని వర్షాలతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాలకు రైతులను కొంత నష్టపరిచి దిగుబడిపై ప్రభావం చూపింది. ఖరీఫ్ పంట చేతికందడంతో రైతులకు వచ్చిన అరకొర దిగుబడిని విక్రయానికి మార్కెట్ కమిటీకి తీసుకొస్తున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో అమాంతంగా పత్తి ధర భారీగా పతనమైంది. క్వింటా గరిష్ఠంగా రూ. 7,300 మించి ధర ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పలకడం లేదు. ఇప్పటి వరకు పలికిన మధ్య ధర గరిష్ఠ రూ. 6500 మాత్రమే పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే క్వింటా రూ. 1,200 ధర తక్కువగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 8110తో పత్తిని కొనుగోలు చేయనున్నారు.

జిల్లాలో 20పైగా కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 20పైగా కొనుగోలు కేంద్రాలు తెరవాలని రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవ్య సీసీఐకి సూచించారు. వ్యవసాయ శాఖ దిగుబడి అంచనా వేసి అధికారులకు అందించారు. ఈ-క్రాపు బుకింగ్ కూడా 90 శాతం పైగా పూర్తయినట్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈనెల 21లోపు పూర్తిగా ఈ-క్రాపు బుకింగ్ నమోదు చేయాలని ఆదేశించారు. ఆదోనిలో 15, ఎమ్మిగనూరులో 3, మంత్రాలయం 2, పెంచికలపాడు ఒకటి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో

టోల్ వసూలు

- పూర్తి కాని జాతీయ రహదారి నిర్మాణ పనులు
- రుద్రవరం వద్ద టోల్‌గేటు ప్రారంభం
- పనులు పూర్తయ్యేందుకు మరో నెల?



రుద్రవరం టోల్‌ప్లాజా వద్ద ప్రారంభమైన వాహనాల రుసుము

నందికొట్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పనులు ఇక సాగుతుండగానే టోల్ రుసుము వసూలు చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. 340సీ జాతీయ రహదారి నిర్మాణం పనులు పూర్తి కాకముందే రుద్రవరం వద్ద టోల్‌గేట్ ప్రారంభమైంది. శుక్రవారం నుంచి పాములపాడు మండలం రుద్రవరం టోల్‌గేట్ వద్ద వాహనదారుల నుంచి టోల్‌ను వసూళ్లు చేస్తున్నారు. కారు, జీప్, వ్యాన్ తేలికపాటి మోటారు వాహనాలకు ఒకే ప్రయాణానికి రూ.120, తేలికపాటి వాణిజ్య వాహనం, తేలికపాటి మంచి వాహనం లేదా మినీ బస్సుకు 190, బస్సు, ట్రక్ (రెండు యాక్సల్స్) రూ.400 మూడు యాక్సిల్ వాణిజ్య వాహనాలకు రూ.440, హెచ్‌సిఎం, ఈఎంఈ ఎంఎవీ(4 నుంచి 6 యాక్సిల్స్) వాహనాలకు రూ.630, భారీ వాహనాలు(ఏడు లేదా అంత కంటే ఎక్కువ యాక్సల్స్) రూ.770 టోల్‌ను నిర్ణయించారు. రుద్రవరం టోల్‌గేట్‌కు సమీపంలో ఓ ప్రార్థనా మందిర స్థల సేకరణ కోర్టులో ఉండడంతో అక్కడ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించలేదు. ఎర్రగూరు వద్ద ఉన్న ఫ్లైఓవర్‌తో పాటు, తెలుగుగంగ కాలువపై కూడా వంతెన పనులు సాగుతున్నాయి. ఆత్మకూరు వద్ద ఉన్న ఫ్లైఓవర్ పనులు సాగుతున్నాయి. ఫ్లైఓవర్ల వద్ద అన్ని పనులు పూర్తయ్యేందుకు ఇంకా నెలరోజుల సమయం పట్టే అవకాశం ఉంది. అసంపూర్తిగా ఉండగానే టోల్‌గేట్‌ను వసూలు చేయడమేమిటని వాహనదారులు చర్చించుకుంటున్నారు.

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోండి

సెట్కూరు సీఈవో వేణుగోపాల్

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు ధరలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సెట్కూరు సీఈవో డాక్టర్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన యువజన సంక్షేమ శాఖ, జిల్లాక్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జీఎస్టీ శ్లాబుల సవరణ వల్ల క్రీడాపరికరాలపై జీఎస్టీ 12 నుంచి 5శాతం వరకు తగ్గిందన్నారు. దీంతో క్రీడాకారులకు తక్కువ ధరలో క్రీడా వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. నంద్యాల ఎంపీడీవో సుగుణశ్రీ మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీ వల్ల దేశీయ డిమాండ్‌ను పునరుద్ధరించాలన్నారు. బొమ్మలు, క్రీడా వస్తువులకు ఇండియాను ప్రపంచ కేంద్రంగా మార్చాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు, క్రీడాప్రాధికార సంస్థ శిక్షకులు సుదర్శన్, కిశోర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా పద్మజ



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డాక్టర్ పి.పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ సివిల్ సర్జన్లకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సివిల్ సర్జన్లకు పదోన్నతులు కల్పించారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న పద్మజను సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా నియమించారు. కొత్తగా విధుల్లో చేరిన పి.పద్మజ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. హాస్పిటల్‌కు వచ్చే ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని, వైద్య సిబ్బంది సహకారంతో ఆసుపత్రిని అభివృద్ధి చేస్తానని ఆమె తెలిపారు.

డిగ్రీ, పీజీ కోర్సులకు దరఖాస్తులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో నాలుగేళ్ల డిగ్రీ, పీజీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని రిజిస్ట్రార్ లోక్‌నాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో లాటరల్ ఎంట్రీలో ప్రవేశానికి బీఎస్సీ, బీకాం, బీఏ, బీసీఏ ఆనర్స్ కూడా అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులను ఉర్దూ వర్సిటీలో ఈనెల 25లోపు అందజేయాలని కోరారు.

శ్రీకృష్ణ దేవరాయలు జయంతిని అధికారికంగా నిర్వహించాలి

బలిజ సంఘం కర్నూలు నగర అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నగర బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మహాయోధుడు, శ్రీకృష్ణ దేవరాయలు జయంతితో పాటు పట్టాభిషేక మహోత్సవాన్ని రాష్ట్ర పభుత్వం అధికారికంగా నిర్వహించాలని కర్నూలు నగర బలిజ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవికుమార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయలు 496వ వర్ధంతి సందర్భంగా, నగరంలో కిసాన్‌ఘాట్ సమీపంలోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవికుమార్ మాట్లాడుతూ సీమలో ఎన్నో చెరువులు, కాలువలు తవ్వించి, దేవాలయాలకు భూరి విరాళాలు అందజేసి, తెలుగు నేలకు రాయలవారు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. తెలుగు భాష వైభవాన్ని పెంపొందించిన రాయలవారు అష్టదిగ్గజ కవులతో సాహిత్యానికి పెద్దపీట వేశారన్నారు. నగరంలో అర్థాంతరంగా నిలిచిపోయిన కాపుభవన్ నిర్మాణం పూర్తి చేయాలని, తగిన నిధులు కాపు భవన్‌కు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, సంఘ ప్రధాన సలహాదారు డాక్టర్ సింగంశెట్టి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఓంకార్, అంజనేయులు, శ్రీనివాసులు, శోభన్‌బాబు, వెంకటేశ్వర్లు, గోపీనాథ్, మురళీమోహన్, మధుబాబు, అపురూప్, రామిరెడ్డి, రంగస్వామి, మునయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు సిద్ధం

(7వ పేజీ తరువాయి)



ప్రభుత్వం చొరవ చూపించి సీసీఐతో చర్చలు జరిపి నిబంధనలు సడలించే ఏర్పాటు చేయడంతో వారి మధ్య సయోధ్య కుదిరింది. దీంతో టెండర్లు కూడా రెండు రోజుల్లో పూర్తయి జిన్నింగ్ పరిశ్రమలు ఎంపిక కానున్నాయి.

కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకుంటేనే..

రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో జిల్లా, మండలం, గ్రామంతోపాటు తన పేరును, పండించిన పత్తి దిగుబడిని నమోదు చేయాల్సి ఉంటుంది. యాప్‌లోనే సీసీఐ నిర్వాకులు కొనుగోలుకు సంబంధించిన వివరాలను రైతులకు తెలియజేస్తారు. ఫలానా తేదీలో రైతు సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచిస్తుంది.

సీసీఐ నిబంధనలు

కేంద్ర ప్రకటించిన మద్దతు ధర రైతులు కందాలంటే తప్పకుండా ఈ నిబంధనలు పాటించాలని సూచిస్తుంది. బన్నీ/బ్రహ్మ పత్తిపింజ పొడుగు 20.50-30.50 ఎంఎం, మైక్రోనైర్ 3.50-4.30 ఉండాలి. తేమశాతం 8 నుంచి 12 శాతానికి మించకూడదు. 12 శాతం మించితే కొనుగోలు చేయరు. 8 నుంచి 12 శాతం వరకు పెరిగిన ప్రతి ఒక్క శాతను 1 శాతం చొప్పున మద్దతు ధరలో తగ్గిస్తారు. 12 శాతం మించితే పత్తిని కొనుగోలు చేయరు. రైతులు తప్పనిసరిగా వాడుకంలో ఉన్న బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకొని ఉన్న బ్యాంకులకు నేరుగా కొనుగోలు చేసిన వారం రోజుల్లో వారి ఖాతాలో జమ చేస్తారు.

యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి



ప్రస్తుతం మార్కెట్‌లో పత్తిధర పతనమైన మాట వాస్తవమే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీసీఐ రంగంలోకి దించింది. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అవుతాయి. ముందుగానే రైతులు కాపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

● గోవిందు, కార్యదర్శి మార్కెట్ యార్డ్ ఆదోని

దీపావళి అయిన వెంటనే కొనుగోలు

రైతులు తక్కువ ధరకు అమ్ముకోకుండా ప్రభుత్వం సీసీఐ ద్వారా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని తమకు సూచించింది. ఇప్పటికే తాము జిన్నింగ్ ప్రెస్సింగ్ పరిశ్రమలను ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నాం. ఆదోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడు కేంద్రాలలో దీపావళి అయిన వెంటనే పత్తిని రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం.

● భరత్, సీసీఐ కేంద్రం జిల్లా ఇన్‌చార్జి

22 నుంచి యాగంటిలో కార్తీక ఉత్సవాలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ ఇందిరమ్మ, అధికారులు

బనగానపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామి కార్తీకమాస ఉత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఈఓతో పాటు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వర్ రెడ్డిలు శుక్రవారం మంత్రి బీసీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి నవంబరు 20వతేదీ వరకు యాగంటిలో కార్తీక మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 27న కార్తీక మాసం తొలి సోమవారం, నవంబరు 3న కార్తీకమాస రెండవ సోమవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు 5న కార్తీక పౌర్ణమి మహోత్సవ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతారన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, దేవదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, ఉపకమిషనర్ పట్టెం గురుప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా యాగంటి క్షేత్రంలో రాత్రి 8 గంటలకు కర్నూలుకు చెందిన కర్నూలుకు చెందిన టీజీవి కళా క్షేత్రం, బనగానపల్లెకు చెందిన అరుణభారతీ సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పడకసీను, భవానీ సీను, గయోపాఖ్యానం, తులాభారం, సత్యహరిశ్చంద్ర కాటిసీను నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. నవంబరు 10 వతేదీన కార్తీక మాసం మూడవ సోమవారం, 17న చివరి సోమవారం సందర్భంగా పూజలు ఉంటాయన్నారు. 17వ తేదీ రాత్రి 'రేలారే రేలా' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, భక్తుల సౌకర్యార్థం ఉమామహేశ్వర నిత్యాన్నదానసంస్థ, ఉమామహేశ్వర రైతు సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, శ్రీరాములు, భరతుడు, యాగంటిపల్లె దస్తగిరి, జోలాపురం తిరుమలయ్య, శంఖేశ్వరరెడ్డి, కృష్ణయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



శ్రీమఠంలో ప్రదక్షిణ చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు

మంత్రాలయం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి మంత్రాలయంలోని అబోడే త్రీస్టార్ హోటల్‌లో బస చేసిన విషయం తెలిసిందే. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఉమాపతి నాయుడుకు ముఖద్వారం వద్ద శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్వర్లు, మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, టీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, రమాకాంత్‌రెడ్డి, విజయరామిరెడ్డి, రాకేష్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటేష్, బెస్త పవన్‌కుమార్, చిన్నభీమాలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల నిజ బృందావనానికి విశేష పూజలు చేశారు. ఏకాదశి కావడంతో ప్రత్యేక పూజలులేకపోవడంతో మఠం పండితులు శేషవస్త్రంకప్పి ఆశీర్వదించారు. వీరి వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీపీగా న్యాయవాది కృష్ణమూర్తి

● ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కర్నూలు లీగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా గవర్నమెంటు ప్లీడర్(జీపీ)గా సీనియర్ న్యాయవాది బి.కృష్ణమూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం పైపాళెం గ్రామానికి చెందిన కురువ నారాయణ, రాములమ్మల కుమారుడు బుల్కొండ కృష్ణమూర్తి మిడుతూరులోనే ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. అనంతరం ఇంటర్మీడియట్, న్యాయవిద్యను కర్నూలులో పూర్తి చేశారు. ప్రముఖ క్రిమినల్ లాయర్ డీసీ సుబ్బన్న ఆఫీసులో జూనియర్‌లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టిన కృష్ణమూర్తి 30 ఏళ్లుగా పలు సంక్లిష్టమైన కేసుల్లో తన వాదనను వినిపించారు. ఈ క్రమంలో కృష్ణమూర్తి సేవలను గురించిన రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారు. కృష్ణమూర్తి నియామకంపై మిడుతూరు మండలం పైపాళెం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా టీడీపీ లీగల్ సెల్ నాయకులు దాసెట్టి శ్రీనివాసులు, కేఈ జగదీష్ గౌడ్‌తో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం



సుధీర్ బాబు

సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం



సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం



జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

కూటమి నేతల్లో జోష్

(7వ పేజీ తరువాయి)

జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలు ప్రజలకు వివరించేందుకు సూపర్ జీఎస్టీ - సూపర్ సక్సెస్ సభలో పాల్గొన్నారు. ఈ సభకు లక్షలాది ప్రజలు వెల్లువలా తరలివచ్చారు.

కూటమి నేతల్లో సంబరం

జీఎస్టీ 2.0 ఫలాలు ఇంటింటికి చేర్చాలి.. ప్రయోజనాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వేర్వేరు థీమ్స్‌తో ప్రచారం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ నాయకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే 98 వేలకు పైగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా దేశంలో తొలిసారిగా సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరిట కర్నూలులో భారీ బహిరంగ సభ గురువారం నిర్వహించారు. ప్రధాని మోదీ పాల్గొన్న ఈ సభను విజయవంతం చేయడానికి రాష్ట్ర మంత్రులు, టీడీపీ, బీజేపీ, జనసేన అగ్ర నాయకత్వం నాలుగైదు రోజులు జిల్లాలోనే మకాం వేసి ఏర్పాట్లు మొదలు జన సమీకరణ వరకు సమష్టిగా కృషి చేశారు. రాష్ట్ర పాలన, అధికార యంత్రాంగం మొత్తం కర్నూలులోనే వాలిపోయింది. రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో దాదాపు 350 ఎకరాల్లో ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు కృషి చేశారు.

అధికారుల కసరత్తు

కర్నూలులో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'ను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మూడు లక్షలకుపైగా జన సమీకరణ అంచనాలు వేశారు. 6వ తేది రాత్రి వరకు సభా ప్రాంగణం స్థలం ఎక్కడో కూడా ఎంపిక చేయలేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి టీజీ భరత్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యేలు మూడు స్థలాలను పరిశీలించారు. అదే రోజు రాత్రికి రాగమయూరి గ్రీన్‌హిల్స్‌ను ఫైనల్ చేశారు. 14వ తేదీ సాయంత్రానినికల్లా సభా ప్రాంగణం ఎస్పీజీ అధికారులకు అప్పగించారు. ఎనిమిది రోజులు పదికిపైగా బృందాలుగా ఏర్పడిన అధికారులు పనులను శరవేగంగా ముగించారు.

ప్రధాని సభ విజయవంతంపై సీఎం చంద్రబాబు అభినందన




జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్లు రాజకుమారి, సిరి

కర్నూలు/నంద్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పర్యటన విజయవంతంపై కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులను సీఎం నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. విజయవంతంలో మమేకమైన ప్రతి ఒక్కరికి పత్యేక అభినందనలు తెలియజేశారు. జీఎస్టీ 2.0 ఫలాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభ, శ్రీశైలం పర్యటన విజయవంతం కావడంతో శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన కార్యాలయం నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు, కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు డాక్టర్ ఎ.సిరి, రాజకుమారి గణియా తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీశైలం మల్లన్న ఆలయ దర్శనం, శివాజీ మెమోరియల్ ట్రస్ట్ సందర్శన ఎంతో తృప్తి, సంతోషాన్ని ఇచ్చిందని మోదీ పేర్కొన్నట్లు చంద్రబాబు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు సిరి, రాజకుమారి, ఎస్పీలు ఎస్పీ విక్రాంత్‌పాటిల్, సునీల్ షెరాన్, డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ నీరజ, డీటీసీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలురైతు బలవన్మరణం

ఎమ్మిగనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కౌలురైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన పట్టణంలోని వెంకటాపురం కాలనీలో చోటుచేసుకుంది. కాలనీవాసులు, రైతులు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన రాఘవేంద్ర (50)కు కొద్దిపాటి పొలం ఉంది. దీనికి తోడు రెండెకరాలు కౌలుకు తీసుకున్నాడు. మూడేళ్లుగా మిరప పంటను సాగుచేస్తున్నాడు. ఇంతకుముందు ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవటంతో పాటు ధరలు పడిపోయి తీవ్రంగా నష్టపోయాడు. ఈనష్టాన్ని ఈ ఏడాది అయినా పూడ్చుకుందామని అప్పులుచేసి మిరపను సాగుచేశా డు. అధికవర్షాలతో ఈఏడాదిసైతం పంట దెబ్బతింది. పంట సాగుకోసం రూ.5లక్షల అప్పులు చేశాడు. ఎలా తీర్చాలోనని మానసిక ఆందోళనకు గురయ్యాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఇంట్లో రాఘవేంద్రను చూసి రోదించారు. చుట్టుపక్కల వారు వచ్చి కిందకు దించగా అతడు అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య మల్లేశ్వరమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు వివా హం చేశాడు. మరో ముగ్గురు పిల్లలు చదువుతున్నారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



రాఘవేంద్ర (ఫైల్)

సీనియర్ అసిస్టెంట్ మృతి

పాణ్యం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి(57) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక మరణించారు. శ్రీనివాసరెడ్డి మృతిపై తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన గతంలో నెరవాడ, కౌలూరు, కొత్తూరు ఉడుమాల్పురం ప్రాంతాల్లో నిర్వహించారన్నారు. శ్రీనివాసరెడ్డి మృతిపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఆర్ఐ రాము, డీటీ శివశంకరరెడ్డి, తొగర్చేడు గ్రామస్థులు తీవ్ర సంతాప వ్యక్తం చేశారు.



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

కోటి సంతకాల సేకరణ

కల్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రారంభిస్తున్నట్లు నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో ప్రజలతో సంతకాలు సేకరణ, రచ్చబండ నిర్వహించారు. ప్రభుత్వం పట్ల అప్పుడే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, త్వరలో ప్రజలు ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు.



సంతకాల సేకరణ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని

బాణసంచా విక్రయాలకు అనుమతి ఉండాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాణసంచా నిల్వ, విక్రయాలకు అనుమతి ఉండాలని, లేనిపక్షంలో ప్రేలుడు పదార్థాల చట్టం, ఐపీసీ సెక్షన్స్ ప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్ డివిజన్ ప్రాంతాల్లో టపాసుల విక్రయించే ప్రాంతాల్లో జాగ్రత్తలు, సూచనలు పాటించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు తావులేకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని విక్రయదారులకు తెలియజేయాల న్నారు. కేటాయించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాట చేసుకుని బాణసంచా విక్రయించాలన్నారు. నీరు, ఇసుక, తదతర అగ్నిమాపక సామగ్రిని విక్రయ దుకాణాల్లో సిద్దంగా ఉంచుకో వాలన్నారు. పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు. లైసెన్సు ఉన్న వ్యాపారులు మాత్రమే బాణాసంచా విక్రయాలు చేయాలన్నారు. దుకాణాల వద్ద అగ్నిమాపక వాహన, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

వేడుకల్లో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా డయల్-112, 100కి గానీ సంబంధిత పోలీసు స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సేవకు మారుపేరు ఆర్యవైశ్యులు

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



వాసవీ భవన్‌ను ప్రారంభించిన టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులంటే సేవకు మారుపేరని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. కర్నూలు నగర శివారు కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో కల్లూరు వాసవి సేవా ట్రస్ట్, కల్లూరు వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీవెంకటేశ్ వాసవీ భవన్‌ను రాష్ట్ర మంత్రి టీజీ భరత్, శిల్పా భరత్ దంపతులు ప్రారంభించారు. ఈ భవనానికి సంబంధించిన శిలాఫలకాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో టీజీ లక్ష్మీ వెంకటేశ్ వాసవీ భవన్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సేవ చేసేందుకు ముందుగా గుర్తుకు వచ్చేది ఆర్యవైశ్యులు మాత్రమే అని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు వాసవీ సేవా ట్రస్టు చైర్మన్ చిలమకూరు రాజశేఖర్, వైస్ చైర్మన్ రామలింగేశ్వర్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, ఇల్లూరు లక్ష్మయ్య పాల్గొన్నారు.

మరో విద్యార్థి మృతదేహం లభ్యం

- శోకసంద్రంలో విద్యార్థుల కుటుంబాలు




లభ్యమైన ఉదయ్‌కుమార్ మృత దేహం... హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన జీడీపీ అధికారులు

గోనెగండ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నీటిలో కొట్టుకుపోయిన మరో విద్యార్థి ఉదయ్ కుమార్ (20) మృతదేహం శుక్రవారం ఉదయం గజ ఈతగాళ్లు నీటి గుంత నుంచి బయటకు తీశారు. గురువారం సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎనిమిది మంది జీడీపీ సందర్శనకు వచ్చారు. అయితే ప్రమాదవశాత్తు చెన్నారెడ్డి, ఉదయ్‌కుమార్ గల్లంతయ్యారు. చెన్నారెడ్డి మృతదేహం గురువారమే లభ్యమైంది. ఉదయ్‌కుమార్ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం గజ ఈతగాళ్లు మరోసారి గాలింపు చేపట్టగా ఉదయ్ కుమార్ మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రులు గోవిందు, రాధ, స్నేహితులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం శోకసంద్రగా మారిపోయింది తహసీల్దార్ రాజేశ్వరి శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రాజెక్టు ను చేరుకొని గత ఈతగాళ్లచే వెతికించడం ప్రారంభించారు. కొద్ది సేపటికే ఉదయ్‌కుమార్ మృతదేహం ఈతగాళ్లకు దొరికింది. మృతదేహాన్ని పోలీసులకు అప్పగించి శవపరీక్ష నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించడానికి వాహనాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జాలర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రస్ట్ గేట్ల ముందు పెద్ద గొయ్యి ఉందని, అందులో పడితే బతకడం కష్టమని జాలర్లు తెలిపారు. అలాగే ప్రాజెక్టు వెనుక వైపు కూడా చేపల గుంతలు ఉన్నాయని, అక్కడ కూడా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయని జాలర్లు వివరించారు.

అర్జున్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- విద్యుత్‌శాఖ నుంచి రూ.5లక్షలు అందజేత



రూ.5లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యేలు, ఎస్ఈ

కర్నూలు రూరల్ అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మోదీ సభకు వస్తూ విద్యుదాఘాతంతో మృతిచెందిన అర్జున్ కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి భరోసానిచ్చారు. శుక్రవారం మునగాలపాడులో భౌతికాయానికి నివాళి అర్పించారు. అనంతరం తల్లిదండ్రులు మద్దిలేటి, రాణెమ్మను ఓదార్చారు. విద్యుత్ శాఖ తరుపున రూ.5లక్షలను విద్యుత్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్‌తో కలిసి అందజేశారు. మట్టి ఖర్చులకు రూ.20వేలు ఇచ్చారు. గాయలతో బయటపడిన క్షతగాత్రులను ఎమ్మెల్యేలు పరామర్శించి ప్రమాద ఘటనను అడిగితెలుసుకున్నారు. క్షతగాత్రులకు ఇద్దరికి ఎమ్మెల్యేలు రూ.10వేల చొప్పున అందజేశారు. మెరుగైన వైద్యం అందిస్తామని వారు క్షతగాత్రులకు హామీ ఇచ్చారు.

పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం చేసిన శ్రీశైలం క్షేత్రం, కర్నూలు పర్యటనను విజయవంతం చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో భారత్‌కు ప్రపంచంలోనే స్వర్ణయుగం నడుస్తోందన్నారు. పధాని వ్యక్తిత్వం, పాలన, దేశ సేవ, ప్రపంచ వేదికపై ఆయన స్థానం గురించి తెలిపారు.

చిట్యాలలో వైసీపీ, టీడీపీ ఘర్షణ

- దెబ్బతిన్న వాహనాలు

క్రిష్ణగిరి / పత్తికొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి మండలంలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం వైసీపీ-టీడీపీ వర్గాల నడుమ ఘర్షణ చోటుచేసుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో వైసీపీ-టీడీపీకి చెందిన ఇద్దరు నాయకులు వాహనాల అద్దాలు స్వల్పంగా ధ్వంసం అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మెడికల్ కాలేజీల ప్రవేటీకరణను నిరసిస్తూ వైసీపీ చేపట్టిన కోటిసంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి క్రిష్ణగిరి మండలం కోయిలకొండ, చిట్యాల, ఆలంకొండ గ్రామాలలో పర్యటించేందుకు పోలీసుల అనుమతికోరారు. అయితే చిట్యాలలో పరిసితులు బాగోలేవని ఆగ్రామపర్యటన రద్దుచేసుకోవాలని పోలీసులు ఆమెకు ముందస్తు హెచ్చరికలు చేశారు. అయితే కోయిలకొండలో కార్యక్రమం ముగించుకుని నేరుగా ఆమె చిట్యాలకు చేరుకోవడంతో వైసీపీ-టీడీపీ వర్గాల నడుమ వివాదం చోటు చేసుకుంది. మాటామాటాపెరగడంతో ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో వైసీపి నాయకుడు వెంకట్రామిరెడ్డికి చెందిన వాహనం, టీడీపీకి నాయకుడు చంద్ర వాహనాల అద్దాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. సీఐ మధుసూదన్ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపుచేసి రెండువర్గాలను అక్కడి నుంచి పంపించివేశారు. కాగా ఇరువర్గాల ఘర్షణతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఘర్షణ జరిగే అవకాశం ఉందని హెచ్చరికలు చేసినా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు అంటున్నారు.



ఘటనా స్థలంలో గుమికూడిన జనం

రాజవర్దన్ మనమధ్య లేకపోవడం బాధాకరం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- రాజవర్దన్‌రెడ్డికి ఘననివాళి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కర్నూలు రూరల్ అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఎంతో భవిష్యత్ కలిగి ఎదిగే సమయంలో రాజవర్దన్‌రెడ్డి మనమధ్య లేకపోవడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. కర్నూలు మండల మాజీ ఎంపీపీ దివంగత యువనాయకుడు డి.రాజవర్దన్‌రెడ్డి జయంతిని శుక్రవారం కోడుమూరు, కర్నూలు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. నగరంలోని నెహ్రూనగర్‌లో ఉన్న విష్ణు నివాసంలో పల్లాతో పాటు, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ నాగరాజు, కోడుమూరు, కనిగిరి ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, ఉగ్రనరసింహారెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్దన్‌రెడ్డి కలిసి రాజవర్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రాజవర్దన్‌రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని పల్లా గుర్తు చేసుకు న్నారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలతో పాటు ప్రభుత్వ ఉత్తర్వులను, న్యాయపరంగా చేయాల్సిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అంతిమంగా ప్రజలకు మేలు చేసి వారి మన్నలను పొందారని వివరించారు. కోడుమూరు, కర్నూలు నియోజకవర్గం నుంచి రాజవర్దన్‌రెడ్డి అభిమానులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు.

అవిశ్వాస తీర్మాన సమావేశం యథాతథం

ఆదోని రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేయాలని హైకోర్టు మెట్లెక్కిన ఆదోని ఎంపీపీ బడాయి దానమ్మకు చుక్కెదురైంది. ఆమె వేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ, తీర్పు ఇచ్చింది. దీంతో ఉన్నత స్థాయి అధికారుల ఆదేశానుసారం ఈనెల 22వ తేదిన వైసీపీ తలపెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశం యథాతథమైంది. 2021 సెప్టెంబరు 24న బడాయి దానమ్మ(వైసీపీ) ఎంపీపీగా ఎంపికైంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె భర్త మాజీ ఎంపీపీ బడాయి పొంపాపతి, తదనంతరం ఆమె సైతం ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరింది. తమ పార్టీ తరఫున గెలిచి, ఎంపీపీ పదవి చేపట్టి బీజేపీలో చేరుతారా అంటూ, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆగ్రహానికి గురయ్యారు. మనకు ఎంపీటీసీల బలం ఉంది. మనల్ని కాదనుకున్న వారిని తొలగించుకుందాం సిద్ధం కావాలంటూ, వైసీపీ ఎంపిటీసీలకు సాయి హుకుం జారీ చేశాడు. దీంతో 19మంది వైసీపీ ఎంపిటీసీలు సెప్టెంబరు 26వ తేదిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఫారం-3 సమర్పించారు. దీంతో సదరు సబ్ కలెక్టర్ అక్టోబరు 22వ తేదిన అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నిర్వహించాలని సంబంధిత ఎంపీడీవో కార్యాలయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంపీపీ బడాయి దానమ్మ హైకోర్టు మెట్లెక్కింది. తనను తొలగించడానికి తనపై పెట్టిన అవిశ్వాస తీర్మాణంలో ఆరుగురు ఎంపీటీసీలు ఫోర్జరీ సంతకాలు పెట్టారని, ఇది చెల్లుబాటు కాదని, వారు తలపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేయాలని బడాయి దానమ్మ ఈనెల 6వ తేదిన హైకోర్టులో రిట్ పిటీషన్ వేసింది. ఎంపీపీ వేసిన రిట్ పిటీషన్‌కు సమాధానం ఇవ్వాలని హైకోర్టు కర్నూలు కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్, డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓలను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు మండల కార్యాలయ అధికారులు ఈనెల 8వ తేదిన కోర్టు ఇచ్చిన నోటీసుకు ఆధారాలతో సమాధానమిచ్చింది. శుక్రవారం సాయంత్రం ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు ఎంపీపీ వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టి వేయడంతోపాటు యధావిధిగా ఈనెల 22వ తేదీన అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని మండల పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్ హైకోర్టు న్యాయవాది సుధీర్ పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత మండల కార్యాలయ అధికారులను వివరణ కోరగా, ఎంపీపీ వేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం వాస్తవమేనన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. శుక్రవారం మత్స్యశాఖ జేడీ కార్యాలయాన్ని సందర్శించారు. బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మా ట్లాడారు. ఉమ్మడి జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం సమీపంలోనే ఉన్నా ఫిష్ ఫారంను పరిశీలించి చేపల పెంపకంపై సమాచారాన్ని సేకరించారు. కార్పొరేషన్ జిల్లా చైర్మన్ బీఎన్ నవీన్‌కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ టీజీ రమేష్, చిరంజీవి, ఎద్దుల వెంకటేశ్, అడ్వకేట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేట్‌పరం వద్దు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే సహించేది లేదని, ఉద్యమాలను ఉధృతం చేస్తామని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం శ్రీలక్ష్మి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కర్నూలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం కానివ్వకుండా కోటి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా వర్కింగ్ అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరి, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, కార్పొరేటర్లు శ్రీనివాస్, సోంపల్లి క్రిష్ణకాంత్ రెడ్డి, సత్యనారాయణమ్మ, సీనియర్ నాయకులు రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

విద్యతోనే గిరిజనుల అభివృద్ధి

పాణ్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. ఆర్జీఎం ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం జాయ్ ఆఫ్ గివింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బండిఆత్మకూరు మండలంలోని నెమలికుంట గూడెంలోని చెంచులకు విద్యార్థులు జాయ్ ఆఫ్ గివింగ్ కార్యక్రమం ద్వారా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ప్రతి అక్టోబరులో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది గిరిజన ప్రాంతాన్ని సందర్శించి చెంచులతో మమేకమై శుభ్రత, ఆరోగ్యం, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారన్నారు. విద్య ద్వారానే గిరిజన అభివృద్ధి సాధ్యమని, సామాజిక బాధ్యతలు, మంచి అలవాట్లు పెంచేలా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

ఆర్జీఎం, ఎఫ్ఎల్ఎం సంస్థ మధ్య అవగాహన ఒప్పందం

పాణ్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం, ఎఫ్ఎల్ఎం సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమ అనుభవం, ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్ తదితర అవకాశాలు ఈ ఒప్పందం కల్పిస్తుందన్నారు. పరిశ్రమ నిపుణుల ద్వారా గెస్ట్‌లెక్చరర్స్, వర్క్‌షాపులు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులకు నైపుణ్యాలు పెంచి వారి భవిష్యత్తుకు పునాదులు వేయడానికి ఈ ఒప్పందం వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు క్రిష్ణ మంత్రవాది, ఉపేంద్ర, కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్, ఎంబీఏ హెచ్ఓడి సౌజన్య పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సాంకేతిక సదస్సు : ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల సీఎస్ఈ (డేటా సైన్స్) విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సాంకేతిక సదస్సు అద్వితీయ 2కె25 నిర్వహించింది. సదస్సులో విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభను వివిధ పోటీల ద్వారా ప్రదర్శించారు. ఈ సదస్సు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మకత, పోటీ స్ఫూర్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రిన్సిపాల్ జయ చంద్రప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అశోక్‌కుమార్, హెచ్ఓడి భాస్కరరావు, కన్వీనర్ రంగస్వామి, కోఆర్డినేటర్ రతి, పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కొత్తపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మండలంలోని ముసలిమడుగు, పెద్ద గుమ్మడాపురం, నందికుంట గ్రామాల్లోని లబ్ధిదారులకు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య రూ.2.92 లక్షల చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని ముసలిమడుగులో రామకృష్ణారెడ్డి అనే బాధితునికి రూ.25వేలు, పెద్దగుమ్మడాపురంలో ఈడిగ సురేంద్రగౌడుకు రూ.1.53లక్షలు, నందికుంటలో కాగుల పద్మావతికి రూ.84,928 చెక్కులను అందజేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి, నందికొట్కూరు, మిడ్తూరు, పగిడ్యాల మండల కన్వీనర్లు లింగస్వామి గౌడు, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కాక రమేష్ రెడ్డి, పలుచాని మహేష్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, మండల క్లస్టర్ ఇన్‌చార్జి నారపురెడ్డి, నాయకులు శివారెడ్డి, బుచ్చిరెడ్డి ఉన్నారు.

యూత్ గేమ్స్ స్టేట్ వాలీబాల్ కోచ్‌కు సత్కారం


వాలీబాల్ కోచ్‌గా ఎంపికైన బండారి రాజేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): యూత్ గేమ్స్ స్టేట్ వాలీబాల్ కోచ్‌గా ఎంపికైన ఆత్మకూరుకు చెందిన బండారి రాజేష్‌ను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ.రాజు, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు శుక్రవారం ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ పస్పేల్ మున్నా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. మారుమూల ఆత్మకూరు ప్రాంతంలో రాష్ట్ర స్థాయిలో వాలీబాల్ జట్టుకు కోచ్‌గా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఈ ప్రాంత క్రీడాకారులు రాజేష్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఇదిలావుంటే వాలీబాల్ క్రీడలో తాను రాణించేందుకు సహకరించిన ఆత్మకూరు వాలీబాల్ అసోషియేషన్ కార్యదర్శి నిమ్మి కృష్ణయాదవ్‌కు కోచ్ రాజేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాణ్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాణ్యం, చిలకల విద్యుత్ కేంద్రాల పరిధిలోని గ్రామాలలో ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మధుసూదన్ శుక్రవారం తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైను మరమ్మతుల కారణంగా విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెరువుల్లో గోదాములు

- రూ.1.15కోట్ల నిధులు నీళ్లపాలు
- రైతులకు ఉపయోగపడని గోదాములు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతన్నలు


లింగాపురం గ్రామ శివారులోని మల్లెలమ్మ చెరువులో నిర్మించిన గోదాము ఇదే

కొత్తపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వాలు గోదాములను నిర్మిస్తోంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం మాత్రం రైతులకు అనుకూలంగా కాకుండా వారి ఇష్టమొచ్చినట్లు నిర్మించి నిధులను కాజేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలకు గానూ 9 పంచాయతీల పరిధిలో రూ.4.65 కోట్ల నాబార్డు నిధులతో గోదాములను నిర్మించారు. గోకవరం గ్రామ పంచాయతీలో ఉన్న లింగాపురం గ్రామ శివారులోని మల్లెలమ్మ చెరువులో రూ.75లక్షలు, శివపురం ఈర్లచెరువులో రూ.40 లక్షల నిధులతో నిర్మించారు. అయితే ఈ గ్రామాల్లో చెరువ నిర్మించడంతో వర్షాకాలం రైతులకు ఎలాంటి ఉపయోగంలోకి రావడం లేదు. గోదాము చుట్టు చెరువును తలపించే విధంగా నీరు చేరుతోంది. కొన్ని గ్రామాల్లో గోదాములు ఆకతాయిలకు ఆశ్రమ నిలయాలుగా మారడమే కాకుండా అసాంఘీక కార్యకలాపాలు, పేకాటలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాముల చుట్టు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకొని, గోదాముల వద్ద భద్రత ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


శివపురంలోని ఈర్లచెరువులో నిర్మించిన గోదాము ఇదే

ప్రభుత్వ నిర్లక్ష్యమే.. రైతులకు శాపంగా మారింది



గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగానే కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన గోడౌన్‌లు ఉపయోగంలోకి లేక రైతులకు శాపంగా మారాయి. గోదాములైతే ప్రారంభించారు గానీ నేటికి రైతులకు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వమైనా స్పందించి నిరుపయోగంగా ఉన్న గోదాములను రైతులు ఉపయోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.

● నక్క స్వాములు, సీపీఎం మండల కార్యదర్శి

ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు కె.సాంబశివుడు, జిల్లా ప్రధానకార్యదర్శి నగిరి శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలు గడుస్తున్నా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు, 4డీఏలను చెల్లించకపోవడం, పీఆర్సీ కమిషన్‌ను నియమించకపోవడం, మధ్యంతర భృతిచెల్లించకపోవడంవల్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 7న ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. దీపావళికి రెండు డీఏలు ప్రకటించాలని, పీఆర్సీని నియమించి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు 57ను అనుసరించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పుల్లయ్య, రవి, మునిస్వామి, రామాంజనేయులు, ఖలీల్‌అహమ్మద్, కృష్ణమూర్తి, ప్రతాపరెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నంద్యాల జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, రిటైర్డ్ పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అపోలో హాస్పిటల్ నుంచి సీనియర్ కార్డియాలజిస్టు, న్యూరాలజిస్టులతో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రాంపక్కీర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సయ్యద్‌చాంద్‌బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ భాస్కరరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యులు ఎల్.కిరణ్‌కుమార్, ఎ.సౌమ్యారెడ్డి 19న జగన్ హాస్పిటల్‌లో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బహిరంగ వేలాలు వాయిదా


బహిరంగ వేలాలు నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో వివిధ రకాల పాత సామగ్రికి బహిరంగ వేలం నిర్వహించగా దేవస్థానానికి అనుకున్నంత ఆదాయం రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం దేవస్థానం పరిపాలన భవనంలో పాతరేకు డబ్బాలతో పాటు పడిపోయిన చింతచెట్లకు బహిరంగ వేలాలు నిర్వహించారు. దేవస్థానం ఆశించినంత ఆదాయం రాక పోవడంతో వాయిదా వేశామన్నారు. అలాగే కార్తీక మాసం పురస్కరించుకొని క్షేత్రంలో 30 రోజుల పాటు ప్రత్యేక విద్యుత్ అలంకరణ పనులను కోవెలకుంట్లకు చెందిన వీరభద్ర సప్లయర్స్ రూ.2.90 లక్షలకు సీల్ టెండర్ పక్రియన దక్కించుకొన్నట్లు ఈవో చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ మధు, పర్యవేక్షకుడు నీలకంఠరాజు, సుబ్బారెడ్డి, క్యాషియర్ బత్తుల నాగభూషణంలు పాల్గొన్నారు.

యువకుడి అస్వస్థత

మహానంది, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం ఎం.తిమ్మాపురంకు చెందిన బోడెద్దుల ఆంజనేయులు అనే యువకుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా శ్రీశైలం క్షేత్రానికి గ్రామస్థులతో కలిసి వారికి కేటాయించిన బస్సులో వస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. శ్రీశైలం సమీపంలోని శిఖరం వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన డివైండర్లను గమనించకుండా బనగానపల్లె ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ కె. శ్రీనివాసరావు బస్సును ముందుకు నడపడంతో బాధితుడు కిందపడ్డాడు. వెంటనే నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కుటుంబ సభ్యులు కోరారు.

గోపవరంలో యువకుడిపై హత్యాయత్నం

మహానంది, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన మోహన్ అనే యువకునిపై గుర్తు తెలియని వ్యక్తులు కాపు కాచి దాడికి ప్రయత్నించినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మహానంది క్షేత్రంలో సెల్‌ఫోన్ కౌంటర్ కాంట్రాక్టర్ వద్ద విధులు నిర్వహించే మోహన్ గురువారం రాత్రి తన విధులు ముగియగానే స్వగ్రామం గోపవరంకు మోటర్ బైక్‌పై బయలు దేరాడు. మార్గమధ్యంలోని గాజులపల్లి ఆర్ఎస్, గోపవరం రహదారిలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అటకాయించి కళ్లలో కారం చల్లి దాడికి ప్రయత్నించే సమయంలో అటుగా వాహనం రావడంతో పారిపోయినట్లు చెప్పారు. బాధితుడడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డుప్రమాదంలో మహిళకు గాయాలు

గడివేముల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గడివేముల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మహిళ గాయపడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు ఓర్వకల్లు మండలం ఉసేనాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు తన భార్య ఉమాదేవితో ఎ.కోడూరు గ్రామంలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి తమ స్వగ్రామమైన ఉసేనాపురం వెళ్తుండగా ప్రమాదవశాత్తు లారీ ఢీకొనడంతో ఉమాదేవి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాయలసీమను విస్మరించిన ప్రభుత్వాలు

నంద్యాల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభి వృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జా దశరధరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కర్నూలులో నిర్వహించిన సభలో విభజన చ ట్టంలో పేర్కొన్న ప్రత్యేక ప్యాకేజి అమలుపై ప్రధాని ఒక్క మాట కూడా ప్రస్తావించకపోవడం రాయలసీమ ప్రజలకు నిరాశ కలిగించిందన్నారు. ప్రధాని పర్యటనకు వందలాది కోట్లు ఖర్చు చేస్తూ రాయలసీమ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రదాని దృష్టికి తీసుకురాడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

నంద్యాల టౌన్ , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : నంద్యాల మండల పరిధిలోని బీమవరం గ్రామ సమీపంలోని కుందూనదిలో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం తాలుకా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల మండలం బీమవరం గ్రామం వద్ద గుర్తు తెలియని 35-40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి శవం లభ్యమైనట్లు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడుకు చేరుకుని శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు.


ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేసే విధానాలను విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. 1999లో చేరిన విద్యుత్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ కల్పించాలని కోరారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, విద్యుత్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఎస్పీఎం వర్కర్స్ మౌలాలి, నరసింహ, సబ్‌స్టేషన్ భాష, ఆపరేటర్స్ వెంకటాద్రి, కుమారస్వామి, అల్తాఫ్, శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

రూ. 2 లక్షల ఆస్తి నష్టం

పాణ్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపనపాడు గ్రామంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో రూ. 2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు బాలసుబ్బమ్మ తెలిపారు. శుక్రవారం పొలానికి వెళ్లిన బాలసుబ్బమ్మ ఇంటినుంచి పొగలు రావడం గమనించిన గ్రామస్తులు ఇంటిని పరిశీలించగా మంటలు చెలరేగినట్లు తెలిపారు. దీంతో విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్‌ను నిలిపివేశారు. ఈ ప్రమాదంలో బీరువా, ఫ్రిజ్, టీవీ, ఆరు బస్తాల బియ్యం, నాలుగు బస్తా మొక్కజొన్న, బస్తా జొన్నలు, వంట సామగ్రి, దుస్తులు, విలువైన సామగ్రి కాలి బూడిదైనట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. వీఆర్వో, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించారు.

ప్రధాని పర్యటన విజయవంతం : బీజేపీ


అభిరుచి మధు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీశైలం, కర్నూలు పర్యటనను విజయవంతం చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మోదీ కోట్ల మంది హృదయాలకు ఆకర్షణ శక్తిగా మారారని, దేశంలో అభివృద్ధికి రథచక్రం కదిలిస్తూ, భారతవనికి కీర్తి మకుట మాణిక్యంలా వెలుగుతున్నారన్నారు. మోదీ నాయకత్వంలో భారత్‌కు ప్రపంచంలోనే స్వర్ణయుగం నడుస్తోందన్నారు. అనంతరం ప్రధాని వ్యక్తిత్వం, పాలన, దేశసేవ, ప్రపంచ వేదికపై ఆయన స్థానం గురించి తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బాలనాగిరెడ్డి, అధ్యక్షులుగా సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శిగా రామలింగారెడ్డి, కోశాధికారిగా వీరప్పలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా లక్ష్మీనారాయణ, ఉస్మాన్‌బాష, తిరుపతయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆనంద్‌లను ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో శాంతినికేతన్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ సుధాకర్

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం క్రాంతినగర్‌లో ఉన్న శాంతినికేతన్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచినట్లు పాఠశాల చైర్మన్ సుధాకర్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన కలాం సైంటిఫిక్ ఆటిట్యూడ్ టెస్ట్‌లో ఎన్.కార్తీక్ 2వ ర్యాంక్, బి.పవన్‌కుమార్ 3వ రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు సాధించారన్నారు. ప్రతిభకనబరచిన విద్యార్థులకు మెడల్, నగదు బహుమతి అందజేశారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యార్థుల కృషివల్ల ఈ విజయం సాధించామన్నారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రోగ్రాం ఇచార్జి రామకృష్ణ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నందికొట్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎస్‌యూఐ నందికొట్కూరు అధ్యక్షులు సాయికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. నందికొట్కూరులో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు అయినా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పినా ఆచరణలో అందుకు భిన్నంగా ఉందన్నారు. వెంటనే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించండి


గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

పాణ్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రవరం గ్రామంలో నేషనల్ హైవే నిర్మాణ పనుల్లో అసంపూర్తిగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టోల్‌ప్లాజా వద్ద ధర్నా చేశారు. నేషనల్ హైవే పీడీ పద్మజ, సిఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేశ్‌బాబు ధర్నా వద్దకు చేరుకొని వారితో చర్చించారు. కల్వర్టు నిర్మాణాలు పూర్తికాక బస్సులు గ్రామంలోకి రావడం లేదని, సర్వీసురోడ్ల నిర్మాణం వెడల్పు చేయాల్సి ఉందని, రైతులు పండించిన ధాన్యం తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఉన్నాయని గ్రామ సర్పంచు, ఎంపీటీసీ, గ్రామ రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే టోల్‌వద్ద స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో హైవే కాంట్రాక్టర్లతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని వారు గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

కార్యదర్శికి సన్మానం


పంచాయుతీ కార్యదర్శిని సన్మానిస్తున్న నాయకులు

మహానంది, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ పంచాయుతీ కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న ఇటీవల విడుదలైన మెగా డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించింది. ఆమెకు కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామంలోని పాఠశాలలో టీచర్‌గా నియమించారు. శుక్రవారం గ్రామంలోని మరకతలింగేశ్వర స్వామి సన్నిధిలో ఆలయ నిర్మాణకర్త కనుమర్ల పూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయినిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడానికి వెళ్తున్న లక్ష్మీ ప్రసన్నను టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో తెలుగు గంగ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ యాదవ్, టీడీపీ బీసీ సెల్ నాయకుడు పాశం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గని చిన్న రంగస్వామి, బోయవీరేష్ పాల్గొన్నారు

పాణ్యం తహసీల్దార్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి

నంద్యాల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 37 మంది తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని పాణ్యం తహసీల్దార్‌గా పనిచేస్తున్న వై. నరేంద్రనాథరెడ్డికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈయన స్వస్థలం కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం పేరేముల గ్రామం. ఈయన 2009లో గ్రూప్-2లో ఉత్తీర్ణులై డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగంలో చేరారు. ఈయన డిప్యూటీ తహసీల్దార్‌గా జిల్లాలోని డోన్, కొత్తపల్లి, ఓర్వకల్లులో పనిచేశారు. 2012లో తహసీల్దార్‌గా పదోన్నతి పొంది కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, కల్లూరు, జిల్లాలోని డోన్, బేతంచెర్ల, ప్రస్తుతం పాణ్యం తహసీల్దార్‌గా పనిచేస్తున్న విషయం తెలిసిందే. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి రావడంతో సదరు తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

విష్ణుచరణ్ జిల్లాకు చేసిన సేవలు మరువలేనివి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్ నందు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ సెక్రటరీగా బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్‌కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ జిల్లాలో రీ సర్వేను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దారులు, వివిధ శాఖల అధికారులు జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు జ్ఞాపికను అందజేసి శాలువలు, పూలమాలలతో సన్మానించారు.

బాధితులకు అండగా ఉంటాం: డీఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

దొర్నిపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హెల్త్ అండ్‌వెల్త్ ఫైనాన్సియల్ కంపెనీలో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులకు అండగా ఉంటామని, నిందితులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రమోద్ అన్నారు. నాలుగు రోజులుగా బాధితులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. శుక్రవారం డీఎస్పీ ప్రమోద్ బాధితుల వద్దకు వెళ్లి జరిగిన పరిస్థితిపై ఆరా తీశారు. డీఎస్పీ మాట్లాడుతూ దొర్నిపాడు గ్రామానికి చెందిన బాసిరెడ్డి వీరారెడ్డి, అతడి అల్లుళ్ల రాజారెడ్డి, మహేశ్వర్‌రెడ్డిలు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కో క్కరి వద్ద నుంచి రూ.2.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల దాక వసూలు చేసి కొద్ది రోజులు జీతాలు చెల్లించి టోకరా పెట్టారు. బాధితులకు జరిగిన అన్యాయంపై విచారించి తగు న్యాయం చేస్తామని అన్నారు. కంపెనీలో డబ్బులు చెల్లించిన ప్రతి ఒక్కరు పోలీసు స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

● దొర్నిపాడు గ్రామంలో కంపెనీలో డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులను సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా నాయకుడు రామచంద్రుడు, సుధాకర్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు శివ పరామర్శించారు. నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు

చాగలమర్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీవన ఎరువుల వాడకంతోనే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కర్నూలు జిల్లా ఏరువాక శాస్త్రవేత్త సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం చాగలమర్రి మూడో రైతు సేవా కేంద్రంలో నానో ఎరువుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. సస్యరక్షణ, యాజ మాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పంట పొలంలో పొలంలో పిలుస్తోందిపై అవగాహన కల్పించారు. ఏవో రంగనేతాజీ, ఏఈవో మంజుల, వీఏఏ సుబ్బరాయుడు, ఎంపీఈహెచ్‌వోలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ

బనగానపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నందవరంలో వెలసిన చౌడేశ్వరీమాతను శుక్రవారం పల్లకిలో ఊరేగించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రిలో కుండపోత వర్షం

● తడిచిన మొక్కజొన్న ధాన్యం
● 13.2 మి.మీ వర్షపాతం నమోదు



చాగలమర్రిలో మొక్కజొన్నపై కప్పిన పట్టాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

చాగలమర్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. 13.2 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, పాఠశాల ప్రాంగణాలు, ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. గోపాయపల్లె రహదారిలోని అడ్డవాగు పొంగి ప్రవహించడంతో ఆయకట్టు రైతులు రాకపోకలు చేసేందుకు అవస్థలు పడ్డారు. చాగలమర్రి, శెట్టివీడు, ముత్యాలపాడు, గొడిగనూరు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిచి దెబ్బతింది. వర్షానికి తడకుండా మొక్కజొన్న ధాన్యంపై కప్పిన పట్టాలలో వర్షపు నీరు నిలవడటంతో రైతులు ఆ నీటిని తొలగించుకొని ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో గడిచిన 24గంటల్లో 29.5మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు, ఏఎస్‌వో బాస్కరరెడ్డి శుక్రవారం వెల్లడించారు. కాగా మండలంలోని కొన్ని గ్రామాల్లో అధికంగానూ, మరికొన్ని గ్రామాల్లో స్వల్పంగానూ వర్షం కురిసినట్లు తెలిపారు. ప్రతి రోజూ వర్షం కురుస్తుండటంతో రబీ సాగుకు ఆటంకం ఏర్పడుతోందని రైతులు వాపోతున్నారు.

సీజేపై దాడి హేయమైన చర్య

ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు



ఆళ్లగడ్డలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి హేయమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేపీ ఓబులేసు అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దాడికి నిరసన తెలియజేశారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఓబులేసు మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన వారిని కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోతి రత్నకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగిపోగుల రాజేష్, మద్దిలేటి, శ్రీనివాసులు, రాంబాబు, నాగరాజు, నడిపి ఓబులేసు, మహేష్, దానమయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్యాపిలి: సీజే బీఆర్ గవాయిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శివనారాయణ మాదిగ, సుం దరం మాదిగా డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

చాగలమర్రి: సీజే బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం అమానుషమని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఎంఎస్పీ సీనియర్ నాయకుడు సంజీవరాయుడు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం నల్లబ్యాడ్జిలతో గ్రామంలో నిరసన ర్యాలీ చేశారు.

కొలిమిగుండ్ల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి ప్రజాస్వామ్యానికి అవమానకరమని దళిత న్యాయవాది మందా విజయ్, ఎమ్మార్పీస్ జిల్లా నాయకులు దస్తగిరి మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలో ఎమ్మార్పీస్, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సీజేఐ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకొని వినతిపత్రం అందించారు.

సంజామల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అమానుషమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు, నంద్యాల ఇన్‌చార్జి మున్నంగి నాగరాజు మాదిగ ఖండించారు. శుక్రవారం సంజామలలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎంఎస్పఈ జిల్లా అధ్యక్షుడు కత్తి ఓబులేసు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు శివరాముడు, మండల ఇన్‌చార్జి చింతమాను చిన్న పెద్దన్న ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ తులసీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



కరపత్రాలు విడుదల చేస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

డోన్ రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. బుగ్గన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజల ఉన్నతి కోసం గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను నిర్మాణానికి పూనుకుందన్నారు. వీటిలో 7 పూర్తి అయ్యాయని, రాష్ట్రంలో అభివృద్ధే జరగలేదంటూ కూటమి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ కింద అందించే సేవలు బంద్ అయ్యాయని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ జరగకుండా ఆపేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తమ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, పార్టీ వలంటరీ విభాగపు జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ డోన్ పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు మల్లికార్జునరెడ్డి, సోమేష్ యాదవ్, దినేష్ గౌడు పాల్గొన్నారు.

బీజేపీ సిద్ధాంతాలు ప్రమాదకరం

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



కాంగ్రెస్‌లో చేరిన వారితో లక్ష్మీ నరసింహ యాదవ్

డోన్‌రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్ధాంతాలు దేశ భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు జే. లక్ష్మీనరసింహ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ భవన్‌లో బేతంచెర్లకు చెందిన యువత డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై దేశ వ్యాప్తంగా రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. నిన్నటి ప్రధాని మోదీ సభతో రాయలసీమకు ఒరిగిందేమీ లేదని, నిరాశ మిగిలిందన్నారు. ప్రత్యేకహోదా, విభజన హామీల ఊసేలేదన్నారు. 8 ఏళ్లుగా ప్రజల నుంచి వసూలు చేసిన అధిక జీఎస్టీ తిరిగి ఇచ్చేస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి, రాయలసీమకు నిధులు రాబట్టలేక రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం పార్టీలో చేరిన షాషావలి, ముస్తాక్, మొహిద్దీన్, రహీంలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార్లపాటి మద్దిలేటి స్వామి, జనార్దన్, బాలస్వామి, సంజీవ్‌కుమార్, రామాంజనేయులు, రజాక్, బోయ రమణ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం

ఆళ్లగడ్డ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకుమని ఏపీ కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెల్త్ అండ్ హెల్త్ పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేసిన రాజారెడ్డి, మహేష్‌రెడ్డి, వీరారెడ్డి లు నాలుగేళ్ల నుంచి కంపెనీ పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు మహేష్‌రెడ్డి టీడీపీలో ఉన్నారంటు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రధాన పాత్రధారులు వీరారెడ్డి, రాజారెడ్డిలు వైసీపీ నాయకులు కారా అని ప్రశ్నించారు. సమావేశంలో ఆళ్లగడ్డ, చాగలమర్రి మండల కన్వీనర్లు శీలం హరికుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు హుసేన్ బాషా, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభ విజయవంతం



ప్రధానికి వీడ్కోలు పలుకుతున్న సందు వెంకటరమణ, మోదీని కలిసిన కొత్తకాపు హేమసుందర్ రెడ్డి

డోన్ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటన కు విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీ సభ విజయవంతమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడు తూ ప్రదాని పర్యటనతో రూ.13,429 కోట్లు విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారన్నారు. జిల్లాకు డ్రోన్ హబ్‌గా దేశంలోనే ప్రథమ స్థానానికి తీసుకెళ్తామని చెప్పారన్నారు. సభ అనంతరం ఓర్వకల్లు విమానాశ్రయంలో మోదీకి వీడ్కోలు పలికి ధన్యవాదాలు తెలపడం ఆనందంగా ఉందని, అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కూడా కలిశామన్నారు.

● **ప్రధానిని కలిసిన హేమసుందర్ రెడ్డి:** సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.హేమసుందర్ రెడ్డి గురువారం ఎయిర్‌పోర్టులో కలిసి ప్రధానితో కరాచలనం చేశారు. ప్రధానిని కలవడం చాలా సం తోషంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌కు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సురవరం గీతా మాదురికి ధన్యవాదాలు తెలియజేశారు.

బెస్త సంక్షేమ అభివృద్ధికి కృషి చేయాలి

కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున



సంఘీభావం తెలుపుతున్న డైరెక్టర్ మల్లికార్జున తదితరులు

డోన్ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బెస్త సంక్షేమ అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల మల్లికార్జున అన్నారు. శుక్రవారం బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేసన్ చైర్మన్‌తో సహా డైరెక్టర్ల పరిచయ కార్యక్రమాన్ని, ప్రమాణ స్వీకారం ఆహ్వాన కమిటిని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజావైద్యశాల మల్లికార్జున పాల్గొని ప్రసంగించారు. తనను బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి గాయాలు

చాగలమర్రి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్ రవిశంకర్‌రెడ్డి శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బీపీ తగ్గిపోయి కింద పడటంతో గాయాలయ్యాయి. రవిశంకర్‌రెడ్డిని స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీంద్రా రెడ్డి, మండల అధ్యక్షుడు మౌలాలి, పీఆర్టీయూ నాయకులు కలిసి చికిత్స పొందుతున్న టీచర్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరు వైద్యశాలకు తీసుకెళ్లారు.

బాలిక విద్యను ప్రోత్సహిద్దాం

బనగానపల్లె, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలికల విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. శుక్రవారం పలుకూరు ప్రాథమిక పాఠశాలలోని 95 మంది విద్యార్థులకు రాతపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మహేందర్‌రెడ్డి సహకారంతో ఈపుస్తకాలు పంపిణీ చేశారు. బ్రహ్మానందాచారి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చదివించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయల సేవలు మరువలేనివి

ఉయ్యాలవాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయలు చేసిన సేవలు మరువలేనివని బలిజ సంఘం మండల అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. హిందూ దేవాయాలు నిర్మించడంలో శ్రీకృష్ణదేవరాయల కృషి అభినందనీయమన్నారు. బలిజసంఘం తాలుకా నాయకుడు అర్జి గారి నరసింహుడు, గౌరవ అధ్యక్షుడు కమతం రాముడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు చిన్న వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు